సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



అదివో..అల్లదివో..!

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి తిరుమలకు 21వ సారి అన్నమయ్య కాలిబాటలో పాదయాత్రను ఈ నెల 15న ప్రారంభించనున్నారు. -8లో



కేసుల పరిష్కారం కోసం లోక్ అదాలత్

కేసుల పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 206 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	375	411
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 239.760 కిలోలు

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డి సర్కిల్: డీఆర్‌డీఏ సీ డ్యాప్, నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ రీజినల్ కోఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి , ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సాయి సునీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కడప నగరంలోని స్మిత్ రోడ్‌లో ఉన్న నిహార్ మల్టీస్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. 15కు పైగా కంపెనీల ప్రతినిధులు రానున్నారన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు : 9063082227,9347579617 లలో సంప్రదించాలని సూచించారు.

ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

కడప ఎడ్యుకేషన్: విజయవాడలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్) భారత ప్రభుత్వం వారు ఓబీసీ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఉచితంగా ఇచ్చి, ఉపాధి కల్పిస్తున్నట్లు సీపెట్ జాయింట్ డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్ సీహెచ్ శేఖర్ తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి 18 నుంచి 35 ఏళ్ల కలిగిన వారు అర్హులన్నారు. పాలిమర్స్ టెక్నాలజీలో మెషీన్ ఆపరేటర్- ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ కోర్సులలో 3 నెలల పాటు శిక్షణ, వారికి సర్టిఫికెట్‌తోపాటు అనంతపురం, హైదరాబాదు, బెంగుళూరు, హోసూరు, చెన్నై ప్రాంతాలలో ప్రముఖ ప్లాస్టిక్స్ అనుబంధ సంస్థలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు, ట్రెనింగ్ కిట్, యూనిఫాం, స్టేపీ షూస్‌ను సీపెట్ అందిస్తుందన్నారు. వివరాలకు సీపెట్ ప్రతినిధి, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ శ్రీను ఫోన్ నంబర్: 6300147965ను సంప్రదించాలని సూచించారు.

శబరిమలకు ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డి సర్కిల్: అయ్యప్ప భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాచిగూడ-కొల్లం (07109)ల మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నారని కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. డిసెంబరు 18, 25, జనవరి 1, 8, 15 తేదీలలో కాచిగూడ నుంచి కొల్లంకు బయలుదేరుతుందని ఆయన పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో డిసెంబరు 20, 27, జనవరి 3, 10, 17 తేదీలలో కొల్లం (07110)లో బయలుదేరుతుందన్నారు. ఈ రైలు కాచిగూడలో రాత్రి 11.45 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.38కు కడపకు చేరుకుని మరుసటిరోజు ఉదయం 5.30కు కొల్లం చేరుతుందన్నారు. కొల్లంలో ఉదయం 10.45 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజామున 5.38కు కడపకు చేరుకుని ఆ తర్వాత మధ్యాహ్నం 3.45కు కాచిగూడ చేరుతుందన్నారు. షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తిరోడ్, గద్వాల్, కర్నూలు, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రేణిగుంట, తిరుపతి, పాకాల, చిత్తూరు, కాట్పాడి తదితర స్టేషన్లలో ఆగుతుందన్నారు.

అభివృద్ధి దీప్తి.. సామాజిక స్ఫూర్తి

- ప్రగతి, సంక్షేమం రెండు కళ్లులా భావించిన సీఎం జగన్
- బడుగు బలహీన వర్గాల ఉన్నతికి కృషి
- పేదల ముంగిట్లోకి సంక్షేమ ఫలాలు
- ఉమ్మడి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత స్థానం
- నేడు చెన్నూరులో సామాజిక సాధికార యాత్ర



సాక్షి ప్రతినిధి, కడప: మౌలిక వసతుల సమకూర్పు, నిర్దిష్ట అభివృద్ధి ఓవైపు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీల ఉన్నతికి సామాజిక సాధికారిత మరో వైపు.. ఈ రెండింటిని రెండు కళ్లలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. వెరసి రాష్ట్ర అభివృద్ధి, అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తున్నారు. స్వాతంత్ర్యం నాటి నుంచి నాయకుల మాటలకే పరిమితమైన 'సామాజిక మార్పు'.. నాలుగున్నరేళ్లుగా వైఎస్సార్‌సీపీ సర్కారు ఆచరణలో చూపెట్టింది. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలు గర్వంగా చెప్పుకునేలా ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాల్లో అత్యధిక భాగస్వామ్యం కల్పించింది. పేదలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఆదరించిన ప్రజలకు.. అండగా నిలిచి..

ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు విపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ అనునిత్యం వారితోనే గడిపారు. అధికారిక బాధ్యతలు చేపట్టగానే, 'నేను విన్నాను-నేను ఉన్నాను' అన్నారు. ఆ మేరకే ఆదరించిన ప్రజలకు అండగా నిల్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా శ్రమించారు. నాలుగున్నరేళ్ల పాలనలో సామాజిక విప్లవాన్ని తీసుకువచ్చారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా రూ.7,984.48 కోట్లు అందించారు. అందులో ఎస్సీలకు రూ.2,000.92 కోట్లు, ఎస్టీలకు రూ.212.47 కోట్లు, బీసీలకు రూ.5,263.09 కోట్లు, మైనార్టీలకు రూ.508 కోట్లు దక్కాయి. ఇంత పెద్ద ఎత్తున జిల్లాలో బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు సంక్షేమం లభించిన చరిత్ర మునుపెన్నడూ లేదని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాత్రమే సాధ్యమైందని విశ్లేషకులు వివరిస్తున్నారు. ప్రభుత్వం చేసిన మేళ్లు చెప్పుకొనేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు ఏకమయ్యాయి. ఆదివారం కమలాపురం నియోజకవర్గ పరిధిలో మండల కేంద్రమైన చెన్నూరు కేంద్రంగా సామాజిక సాధికార యాత్ర నిర్వహిస్తున్నారు.

కనీస శ్రద్ధ చూపని టీడీపీ

బడుగు, బలహీనవర్గాల ఓట్లపై ఉన్న శ్రద్ధ.. వారి ఉన్నతి పట్ల తెలుగుదేశం పార్టీ ఏనాడూ చూపలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే బీసీ జపం చేస్తూ, ఆ తర్వాత వదిలేసే పాలసీ అమలు చేస్తోందని వివరిస్తున్నారు. రాజ్యాధికారంలో భాగస్వామ్యం చూపెట్టకపోగా, సామాజిక వెనుకబాటుతనం అలాగే ఉండేలా కేవలం పనిముట్లు మాత్రమే పంపిణీ చేసేదని పలువురు వివరిస్తున్నారు. అలాంటి పరిస్థితి నుంచి జగనన్న అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెన, వైఎస్సార్ రైతు భరోసా, సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా, పింఛన్ కానుక, చేయూత, ఆసరా, బీమా, నేతన్న నేస్తం, జగనన్న చేదోడు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, కల్యాణమస్తు, షాదీతోఫా, జగనన్న తోడు తదితర పథకాల ద్వారా జిల్లాలోని 19,54,575 మంది లబ్ధిదారులకు రూ.12,061 కోట్ల లబ్ధి చేకూరింది. అందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన 12,86,500 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఆయా వర్గాలకు రూ. 7,984.48 కోట్లు నేరుగా లభించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే బడుగు, బలహీన వర్గాలకు సమున్నత గౌరవం దక్కిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆత్మగౌరవం కోసం..

రాబోవు ఎన్నికల్లో పెత్తందారులు ఓ వైపు, పేదలు మరోవైపు పోటీ పడనున్న నేపథ్యంలో.. దీటుగా ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలనే దిశగా వైఎస్సార్‌సీపీ ప్రజలకు సూచిస్తోంది. ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితం చేసిన టీడీపీ ఓ వైపు.. సామాజిక స్థాయి, ఆర్థిక ఉన్నతి, ఆత్మగౌరవం పెంచిన వైఎస్సార్‌సీపీ మరోవైపు ఉన్న నేపథ్యంలో.. ఆత్మగౌరవం నిలుపుకొనేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల వర్గాలకు చెందిన నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నారు. బడుగులకు అండగా ఉంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చాలని కోరుతూ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర ఆదివారం చెన్నూరు వద్ద నిర్వహించనున్నారు. ఇందులో స్థానిక ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డితోపాటు మంత్రులు కారు మూరి నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, కడప మేయర్ సురేష్‌బాబు పాల్గొననున్నారు.

రూ.809 కోట్ల లబ్ధి

కమలాపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ సర్కారు వివిధ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారులకు రూ.1,115.2 కోట్లు అందించింది. అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు చెందిన లబ్ధిదారులకు రూ.809.22 కోట్లు దక్కింది. సంక్షేమ పథకాల ద్వారా లభించిన మొత్తంలో దాదాపు 59 శాతం సింహభాగం బడుగు, బలహీన వర్గాలకు చేరింది. అందులో బీసీలకు రూ.485.53 కోట్లు, ఎస్సీలకు రూ.254.6 కోట్లు, ఎస్టీలకు రూ.18.46 కోట్లు, మైనార్టీలకు రూ.50.63 కోట్లు లభించాయి. నియోజకవర్గంలో ఇంతటి భారీ స్థాయిలో మునుపెన్నడూ దక్కలేదని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

రూ.1378 కోట్లతో ప్రగతి పనులు

కమలాపురం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రభుత్వం విశేష శ్రద్ధ చూపెట్టింది. దాదాపు రూ.1378 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టింది. అందులో ఆర్‌అండ్‌బీ పరిధిలో రూ.295.58 కోట్లతో వివిధ పనులు చేపట్టింది. ఇరిగేషన్ శాఖ పరిధిలో రూ.37.96 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రూ.112.96 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో రూ.62.70 కోట్లు, పబ్లిక్ హెల్త్‌లో రూ.93.49 కోట్లు, కమలాపురం మున్సిపాలిటీ పరిధిలో రూ.95.75 కోట్లు, నాడు-నేడు ద్వారా పాఠశాల అభివృద్ధికి రూ.59.9 కోట్లు, ఏపీఐఐసీ ద్వారా రూ.273.5 కోట్లు, జీఎస్ఎస్ఎస్‌లో రూ.212.89 కోట్లు, నేషనల్ హైవేలో రూ.82.2 కోట్లు, ఆప్కాబ్ ద్వారా రూ.15 కోట్లు, సోషల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా రూ.36 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ఇంతటి అభివృద్ధి పనులు వైఎస్ జగన్ సర్కారులోనే సాధ్యమయ్యాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో..



సీఎం వైఎస్ జగన్ సర్కారు సంక్షేమం, అభివృద్ధికి సమపాళ్లలో ప్రాధాన్యత ఇచ్చింది. సామాజిక న్యాయం పాటించింది. కేబినెట్ కూర్పులో 70 శాతం మంది మంత్రులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అవకాశం కల్పించారు. అత్యున్నత హోదా కల్గిన రాజ్యసభ సభ్యులుగా, ఎమ్మెల్సీలుగా ఎంపిక చేసి బీసీ, ఎస్సీలకు ప్రాధాన్యత ఇచ్చారు. - పి.రవీంద్రనాథరెడ్డి, ఎమ్మెల్యే, కమలాపురం

సాధికారత మా విధానం



సాధికారత నినాదమే కాదు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విధానం. గతంలో నిధులు, విధులు, నియామకాల్లో అసమానతల కారణంగా ఉద్యమాలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమ న్యాయం, సామాజిక న్యాయం పాటిస్తుండటంతో ఉద్యమాలు కనుమరుగయ్యాయి. -పి.నరేన్ రామాంజులురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, చింతకొమ్మదిన్నె

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట



గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆర్థిక, రాజకీయ, సామాజిక సాధికారతకు పెద్దపీట వేశారు. అందుకే బీసీ వర్గంలో మధ్య తరగతికి చెందిన నేను ఎంపీపీ కాగలిగాను. నాలాంటి ఎందరో పార్టీ, ప్రభుత్వ పదవుల్లో కొనసాగుతున్నారు. - చీర్ల సురేష్ యాదవ్, బీసీ నేత, ఎంపీపీ, చెన్నూరు

సభ ఏర్పాట్లు పరిశీలన

చెన్నూరు: మండలంలోని కొండపేట బ్రిడ్జి వద్ద ఆదివారం జరిగే సామాజిక సాధికార యాత్ర సభకు సంబంధించిన ఏర్పాట్లను శాసనసభ్యులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎస్పీ సిద్ధార్థ కౌశల్, చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సభకు సంబంధించిన ఏర్పాట్లపై స్థానిక నాయకులతో ఎమ్మెల్యే చర్చించారు. మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేసిన తర్వాత సభ జరిగే స్థలానికి చేరుకుంటారని తెలిపారు. అలాగే ఎస్పీ సిద్ధార్థ కౌశల్ పోలీస్ అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ముఖ్యంగా బాటసారులకు, ద్విచక్ర వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ జీఎస్ భాస్కర్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, నియోజకవర్గ మైనార్టీ కన్వీనర్ అన్వర్ బాషా, సొసైటీ అధ్యక్షులు అల్లి శ్రీరామ్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీతో చర్చిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

బైక్ ర్యాలీ

చెన్నూరు: బస్సు యాత్రపై ప్రచారంలో భాగంగా చెన్నూరు టౌన్‌లో సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి నేతృత్వంలో గొర్లపుల్లయ్య గారి శివారెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చంద్రఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ అధ్యక్షుడు పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ కరీముల్లా, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, సర్పంచులు సిద్దయ్య గారి వెంకట సుబ్బయ్య, తుంగ చంద్రశేఖర్ యాదవ్, ఎంపీటీసీలు నాగిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, పీసీ కేశవరెడ్డి, కిరణ్, టీఎస్ చంద్రారెడ్డి, నిత్య పూజ తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ షరీఫ్, సీఐ అశోక్‌రెడ్డి, ఎస్సైలు శ్రీనివాసులు రెడ్డి, చిన్న పెద్దయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, నేతలు

జయప్రదం చేయాలి

కడప కార్పొరేషన్ : కమలాపురం నియోజకవర్గంలోని చెన్నూరు మండలం కొండపేటలో ఆదివారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను జయప్రదం చేయాలని శాసనమండలి సభ్యుడు రమేష్ యాదవ్ కోరారు. శనివారం ఇక్కడి వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్‌కుమార్, ఎంపీపీ భాస్కర్ యాదవ్, మనోజ్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

- కరువు, తుపానుతో దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, చిత్రంలో డిప్యూటీ సీఎం, కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్: ఉమ్మడి జిల్లాలో కరువు, తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాధారణ వర్షపాతం కన్నా 27.8 శాతం తక్కువ నమోదైందని పేర్కొన్నారు. దీంతో రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతిని నష్టాలు వచ్చాయన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడానికి ఉమ్మడి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ ప్రభుత్వానికి తీర్మానాన్ని పంపుతామన్నారు. ఇటీవలి తుపాను కారణంగా అరటి, బొప్పాయి, తమలపాకు, టమాట, మామిడి వంటి పంటలు 6250 ఎకరాల్లో దెబ్బతిని నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనాలు తయారు చేశారని పేర్కొన్నారు. 28 మండలాల్లో 170 గ్రామాల్లో రైతులు పంటలు నష్టపోయారని తెలిపారు. ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు రెండవసారి గణన (ఎన్యుమరేషన్) నిర్వహిస్తారని తెలిపారు. ఈ వివరాలు ఆర్బీకేల్లో డిస్‌ప్లే చేస్తారని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే రైతులు తెలుపవచ్చన్నారు. 20 నుంచి సోషల్ ఆడిట్ జరిపి 26వ తేదీ ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు పంపుతుందని చెప్పారు. తుపాను వల్ల నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించాలని సమావేశంలో తీర్మానిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే అరటి పంటకు ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా ఇవ్వాలని సమావేశంలో తీర్మానించి ప్రభుత్వానికి పంపుతున్నట్లు వెల్లడించారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో ఏ ఒక్క రైతు నష్టపోకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ పంట పొలాలు, శ్మశాన వాటికలకు రహదారులు నిర్మించాలని కోరారు. ఇందుకు జెడ్పీ చైర్మన్ స్పందిస్తూ ఉపాధి హామీ నిధులతో గ్రావెల్ రోడ్లు నిర్మించాలని తీర్మానం చేస్తున్నట్లు ప్రకటించారు. కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ జిల్లాలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 833 అంగన్వాడీ కేంద్రాల మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో ఎక్కడ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా, మానవ తప్పిదాల వల్ల ప్రమాదాలు జరిగినా ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించి పరిహారం అందజేస్తోందని రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, మేయర్ సురేష్‌బాబు అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ మీటింగ్ హాలులోని చైర్మన్ చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమది రైతు పక్షపాత ప్రభుత్వమని, రైతులకు ఏ చిన్న కష్టం వచ్చినా తమ ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించి సాయం చేస్తుందన్నారు. గతంలో వరదలు, కరువు వల్ల రైతులు నష్టపోతే వారికి పరిహారం రావడానికి సంవత్సరాలు పట్టేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడు రోజుల్లోనే నివేదిక పూర్తి చేసి, నెలరోజుల్లోనే పరిహారం అందజేయడం జరుగుతోందన్నారు. ఎంత చేస్తున్నా ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై బురదజల్లుతున్నాయని విచారం వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కడప మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

గ్రూప్-1, 2 ఉద్యోగ పరీక్షలపై

ఉచిత అవగాహన సదస్సు

- డిసెంబర్ 16వ తేదీన వైఎస్సార్ కడపలో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: విద్యార్థులకు గ్రూప్-1, గూప్-2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో..గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్-1, గ్రూప్-2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత

ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గారు గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 81791 00598 ఫోన్ నంబర్‌కు తమ పేరు, ఫోన్ నంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపగలరు.

ముఖ్య సమాచారం

అవగాహన సదస్సు తేదీ
డిసెంబర్ 16, 2023 (శనివారం)

వేదిక
హరిత హోటల్, ఎస్పీ బంగ్లా ఎదురుగా, కోటిరెడ్డి సర్కిల్, కడప

సమయం
ఉదయం 09:30 నుంచి 12:30 వరకు.

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 8179100598

క్లుప్తంగా

108లో సుఖ ప్రసవం



తల్లీబిడ్డతో ఈఎంటీ అనిల్

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు పంచాయతీ గొడుగువారిపల్లికి చెందిన రెడ్డిశేఖర్ భార్య మాధవికి శనివారం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో భర్త 108 వాహనానికి ఫోన్ చేయగా పీటీఎంకు చెందిన పైలెట్ రమేష్‌బాబు, ఈఎంటీ అనిల్ అక్కడికి చేరుకున్నారు. గర్భిణిని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికం కావడంతో 108 సిబ్బంది వాహనంలో సుఖ ప్రసవం చేశారు. ఓ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను బి.కొత్తకోట ఆసుపత్రికి తరలించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : భర్త మరో వివాహం చేసుకున్నాడన్న మనస్తాపంతో అతడితో గొడవపడి వివాహిత ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన శనివారం పట్టణంలో జరిగింది. వాల్మీకిపురం కోటవీధికి చెందిన ఎస్.రెహానా (24)కు మదనపల్లె ఈశ్వరమ్మకాలనీకి చెందిన రియాజ్‌తో కొంతకాలం క్రితం ప్రేమవివాహం జరిగింది. అయితే ఇటీవల భర్త రియాజ్ మరో మహిళను వివాహం చేసుకోవడంతో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. శనివారం ఈశ్వరమ్మకాలనీ అత్తవారింటికి వచ్చిన రెహానా భర్త రెండోపెళ్లి విషయమై కుటుంబ సభ్యులు, భర్తతో గొడవపడింది. అనంతరం ఆర్టీసీ బస్టాండుకు చేరుకుని మనస్తాపంతో అక్కడే పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు

అదివో..అల్లదివో..!

అదివో..అల్లదివో అంటూ శ్రీవారిని స్మరిస్తూ..వేడుకొంటూ అత్యంత భక్తితో రాజంపేట మండలంలోని తాళ్లపాక వాసి పదకవితాపితామహుడు అన్నమాచార్యులు ఏడు కొండలను ఎక్కిన కాలిబాట అది. ఇది వెయ్యేళ్ల కిందటి మాట. ఆహ్లాదకరమైన దట్టమైన అటవీ మార్గంలో శ్రీవారిని దర్శించుకునేందుకు ఆరోజుల్లో పూర్వీకులు వేల సంఖ్యలో వెళ్లేవారు. అన్నమయ్య వారసులు సైతం ఈ మార్గంలో కొండకు నడిచివెళ్లారు. టీటీడీ అన్నమయ్య కాలిబాట అభివృద్ధికి నడుంబిగించి భక్తులను ఆనంద పరవశులను చేస్తోంది.

- నేటికీ అన్నమయ్య కాలిబాటలో వెంకన్న భక్తుల నడక
- కాలిబాట ఆద్యంతం ఆహ్లాదకరం, ఆధ్యాత్మికం
- 15న రాజంపేట నుంచి 21వ తిరుమల మహాపాదయాత్ర



శేషాచలం అడవిలో అన్నమయ్య కాలిబాట దృశ్యం

రాజంపేట : కలియుగదైవం శ్రీ వెంకటేశ్వరస్వామిపై 32వేల కీర్తనలు రాసి ఆలపించి, మహాభక్తునిగా ప్రఖ్యాతిగాంచిన శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యులు తిరుమలకు నడిచి వెళ్లిన కాలిబాటలో వెళ్లడం మహాభాగ్యంగా శ్రీవారి భక్తులు భావిస్తున్నారు. ఆ కాలిబాటలో తిరుమల కొండకు చేరుకుంటున్నారు.

అన్నమయ్య కాలిబాట అభివృద్ధికి..

గతంలో అన్నమయ్య కాలిబాటను పునరుద్ధరించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఉన్నప్పుడు దివంగత సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అప్పట్లో వైఎస్సార్ స్పందించి టీటీడీకి ఈ కాలిబాటను పరిశీలించాలని ఆదేశాలు కూడా జారీచేశారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పాలక మండలి అన్నమయ్య కాలిబాట అభివృద్ధికి ఆమోదం తెలిపింది. ఆ దిశగా చర్యలు చేపట్టడంలో నిమగ్నమైన సంగతి తెలిసిందే.

కాలిబాట స్వరూపం ఇలా...

- మామండూరు–బాలపల్లె మధ్య స్వామిపాదాల నుంచి తిరుమల కాలిబాట ప్రారంభమవుతుంది. పక్షుల కిలకిలలు, సెలయేళ్లు, ఆహ్లాదకరమైన వాతావరణం నడుమ కొండకు చేరుకుంటుంది.
- అవ్వతాత గుట్టలు, శుక్రవారం బండలు, పురాతన సత్రాలు, ఎర్రిగుంటలు, ఈతకాయల మండపం నుంచి గోగర్భతీర్థం(తిరుమల) చేరుకుంటుంది.
- సుమారు ఈ కాలిబాట 14 కిలోమీటర్ల దూరం ఉంటుంది. కాలిబాట పూర్తిగా దట్టమైన అడవిలో ఉంటుంది.
- పాదాలు, అక్కడి కోనేరు, సత్రాలు కాలగర్భంలో కలిసిపోయాయి.

కాలిబాటకు వెయ్యేళ్లు..

రాజంపేట మండలంలోని తాళ్లపాక నుంచి అన్నమయ్య నడిచివెళ్లిన కాలిబాట నేడు శిథిలమైంది. వెయ్యేళ్ల క్రితం ఉన్న రహదారి అభివృద్ధిపై తిరుమల తిరుపతి దేవస్థానం దృష్టి సారించింది. ఈ బాట ద్వారా వెయ్యేళ్ల క్రితం నుంచి భక్తులు గోవింద నామస్మరణలు చేసుకుంటూ శ్రీవారి సన్నిధికి చేరుకుంటూనే ఉన్నారు.

ఉత్తర, దక్షిణ భారతీయులకు అనుకూలం..

పూర్వం తిరుమలకు ఈ దారి గుండా అధిక సంఖ్యలో శ్రీవారి భక్తులు వెళ్లేవారు. అయితే తిరుపతి నుంచి ఏడుకొండలు మీదుగా తిరుమల చేరుకోవడం నేడు పరిపాటిగా మారింది. ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశంతోపాటు తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు చెందిన వారు తిరుపతికి వెళ్లకుండానే నేరుగా అన్నమయ్య కాలిబాట ద్వారా స్వామి సన్నిధికి చేరుకోగలరు. స్వామి సన్నిధికి చేరుకునే పుణ్య పవిత్రమైన మార్గంగా కాలిబాట ప్రాచుర్యం పెరుగుతోంది.



108 అడుగుల అన్నమయ్య విగ్రహం

అటవీప్రాంతం	శేషాచలం
తొలినడక	అన్నమాచార్యుడు
కాలిబాట ప్రారంభం	మామండూరు-బాలపల్లె మధ్య
చరిత్ర	వెయ్యేళ్లు
దూరం	23కిలోమీటర్లు
అనుకూలం	ఉత్తర, దక్షిణ భారతీయులు, తెలంగాణ, రాయలసీమవాసులకు

15న ఆకేపాటి పాదయాత్ర



ఈనెల 15న శుక్రవారం జిల్లాపరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్ రెడ్డి 21వసారి వేలాదిమందితో అన్నమయ్య కాలిబాటలో పాదయాత్రను చేపట్టి ఏడుకొండలు చేరుకోనున్నారు. ఈయనతోపాటు అనేక మంది గోవిందమాలలు ధరించి అన్నమయ్య కాలిబాటలో వెళ్లనున్నారు. ఉదయం శ్రీవారికళ్యాణం (ఆకేపాడు ఆలయాల సముదాయం) వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం 2 గంటలకు తిరుమల మహాపాదయాత్ర ప్రారంభమవుతుంది.

కాలిబాటలో నడిచివెళ్లడం మహాభాగ్యం



పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు తిరుమలకు నడిచివెళ్లిన కాలిబాటలో వెళ్లి శ్రీవారిని దర్శించుకోవడం మహాభాగ్యం. గోవిందమాల ధరించి పాదయాత్ర చేస్తున్న స్వాములు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలి. జిల్లాపరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి 21వసారి కాలిబాటలో పాదయాత్ర చేపట్టడం అభినందనీయం.

- పండుగాయల రత్నాకర్, ఉత్తరఅమెరికా ఏపీ ప్రభుత్వప్రతినిధి

అన్నమయ్య కాలిబాట అభివృద్ధికి కృషి



అన్నమయ్య కాలిబాట అభివృద్ధికి జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఎంతగానో కృషిచేశారు. దివంగత సీఎం, ప్రస్తుత సీఎం, టీటీడీ చైర్మన్ల దృష్టికి కాలిబాట అంశం తీసుకెళ్లారు. ఫలితంగా ఇప్పుడు అన్నమయ్య కాలిబాట అభివృద్ధి దిశగా అడుగులు పడ్డాయి. అన్నమయ్య కాలిబాటలో వెళ్లే భక్తులకు వైద్య ఆరోగ్యశాఖ కూడా సేవలందించడం కొన్నేళ్లుగా జరుగుతూ వస్తోంది.

-పిల్లి పిచ్చయ్య, అధ్యక్షుడు, తాలుకా పెన్షనర్ల సంఘం, రాజంపేట



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యవస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. –సాక్షి నెట్‌వర్క్

సొంతింటి కల సాకారం



ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలో నివాసం ఉంటూ చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించే కుటుంబం మాది. గతంలో ఇంటి కోసం అర్జీలు పెట్టుకున్నా ఎవరూ కనికరించలేదు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన అనంతరం ఎవరి సిఫార్సు లేకుండానే గ్రామ వలంటీరు ద్వారా అర్జీ ఇవ్వగానే ఇల్లు మాంజూరైంది. నిర్మాణం పూర్తి చేసుకుని గృహ ప్రవేశం చేశాము. మా సొంతింటి కల సాకారమైంది. - సర్తాజ్, పీలేరు

ప్రభుత్వ పాఠశాలలు భేష్



గత 40 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. అప్పటికీ ఇప్పటికీ చాలా తేడా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల పట్ల శ్రద్ధ చూపి అభివృద్ధి చేయడం సంతోషంగా ఉంది. గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి.

- నాగోలు నర్సరామిరెడ్డి, ఉపాధ్యాయుడు, రాఘవరాజుపురం ప్రభుత్వ పాఠశాల, రైల్వేకోడూరు మండలం

లక్ష్య సాధనే ప్రధానం కావాలి

జిల్లా ఎస్పీ బి కృష్ణారావు



ఫైరింగ్‌లో శిక్షణ పొందుతున్న పోలీస్ అధికారులు, సిబ్బంది

రాయచోటి : విధి నిర్వహణలో ప్రతి బుల్లెట్టు లక్ష్యాన్ని ఛేదించేలా పోలీసులు శిక్షణ పొందాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. శనివారం రాయచోటిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో పేరెడ్ గ్రౌండ్‌లో పోలీసు అధికారులు, సిబ్బందికి వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్‌లో భాగంగా పునశ్చరణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణా తరగతులను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఫైరింగ్ సాధనకోసం ఉపయోగించే ఆయుధాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫైరింగ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని మంచి మెలకువలు నేర్చుకోవాలన్నారు. ఫైరింగ్‌లో అనుమానాలు ఉంటే వాటిని నివృత్తి చేసుకోవాలన్నారు. ఫైరింగ్ రేంజ్‌లో సివిల్ పోలీసు సిబ్బందికి ఏఆర్ పోలీస్ అధికారులు ప్రాక్టీస్ నిర్వహించారు. వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్‌లో ఏఆర్ డీఎస్పీ పి.మహబూబ్ బాషా, రాజంపేట డీఎస్పీ చైతన్య కృష్ణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ జావిద్, జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నమూనా ఆవిష్కరణ



ఆలయ నిర్మాణ నమూనాలు ఆవిష్కరిస్తున్న బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్

రాయచోటి: రాయచోటిలో నూతనంగా నిర్మించనున్న దేవకీ యశోద క్రిష్ణ ఆలయం నమూనా చిత్రాలను బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్‌ల చేతులు మీదుగా ఆవిష్కరించారు. శనివారం తిరుమల స్వామి దర్శనానికి వచ్చిన మాజీ సీఎం, డిప్యూటీ సీఎంలను రాయచోటికి చెందిన ఆలయ ట్రస్టు చైర్మన్ పి.మహేష్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా రాయచోటి కేంద్రంలో నిర్మిస్తున్న ఆలయ విశేషాలను వారికి వివరించారు. ఆలయ భూమి పూజకు కుటుంబ సమేతంగా రావాలని వారిని ఆహ్వానించినట్లు మహేష్ తెలిపారు.

విద్యార్థిని దూషించిన కేసులో ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు

కొండాపురం : స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నాగమణి అనే విద్యార్థినిని దూషించిన కేసులో పోలీసులు ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని నాగమణి బయోమెట్రిక్ వేసేందుకు శనివారం ఆఫీస్ గది వద్దకు వెళ్లింది. గతంలో ఇదే పాఠశాలలో పనిచేసిన సెక్యూరిటీ సూపర్‌వైజర్ వెంకట నాగలక్ష్మి, ఆమె భర్త అశోక్ కుమార్‌తో అదే సమయంలో ప్రిన్సిపాల్‌తో మాట్లాడేందుకు వచ్చారు. అక్కడ వారికి ఎదురుపడిన నాగమణిని దూషించడంతో ఆమె మానసికంగా భయాందోళనకు గురై స్పృహ కోల్పోయింది. వెంటనే పాఠశాల సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసికెళ్లారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆసుపత్రికి వచ్చి బాలికతో మాట్లాడి వివరాలు సేకరించారు. సెక్యూరిటీ గార్డు ఉద్యోగం పోయేందుకు ఆ విద్యార్థిని తల్లి కారణమనే ఉద్దేశంతో వారు దూషించారని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. పాఠశాలకు ఎంఈఓలు ఓబులేసు, రామయ్య వెళ్లి జరిగిన ఘటనపై ఆరా తీశారు.

లారీ ఢీకొని అయ్యప్పస్వామి భక్తుడు దుర్మరణం



మృతి చెందిన అయ్యప్పస్వామి భక్తుడు నారాయణ

పీలేరు రూరల్ : లారీ ఢీకొని అయ్యప్పస్వామి భక్తుడు దుర్మరణం చెందిన సంఘటన పీలేరు - రాయచోటి జాతీయ రహదారి రాయలవారిపల్లె వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మణ్యం జిల్లా పాచిపేట మండలం మాతుమూరు గ్రామానికి చెందిన ఆవుల నారాయణ (60) తోటి అయ్యప్పస్వామి భక్తులతో కలసి ఈ నెల 6న ఇరుముడి కట్టి టూరిస్టు బస్సులో శబరిమలై యాత్ర ప్రారంభించారు. శ్రీశైలం తదితర పుణ్యక్షేత్రాలు చూసుకుంటూ శనివారం ఉదయం పీలేరు సమీపంలోని రాయలవారిపల్లె వద్ద కాలకృత్యాలు తీర్చుకోవడానికి రోడ్డు పక్కన బస్సు ఆపారు. నారాయణ రోడ్డు దాటే క్రమంలో రాయచోటి వైపు నుంచి వచ్చిన సిమెంట్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ మోహన్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోలీసులపై రాళ్లు విసిరిన యువకులు

ప్రొద్దుటూరు క్రైం : అర్ధరాత్రి దాటిన తర్వాత స్కూటీలో వెళ్తున్న యువకులు పోలీసులపై రాళ్లను విసిరిన సంఘటన ప్రొద్దుటూరులో చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. నైట్ పెట్రోలింగ్‌లో భాగంగా వన్‌టౌన్ ఎస్ఐ హైమావతి శనివారం వేకువ జామున 1.30 గంటల సమయంలో బైపాస్ రోడ్డులోని రెండు కుళాయిలకు వెళ్లే దారిలో సిబ్బందితో కలిసి విధులు నిర్వహిస్తున్నారు. ఆ ప్రాంతంలో ఉన్న పలువురిని పిలిచి ఈ సమయంలో ఇక్కడ ఎందుకు ఉన్నారని ప్రశ్నిస్తూ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో జమ్మలమడుగు వైపు నుంచి ఇద్దరు యువకులు స్కూటీలో వస్తున్నారు. వారి రాకను గమనించిన పోలీసులు ఆపాల్సిందిగా చెయ్యి చాచారు. పోలీసులను చూసిన యువకులు స్కూటీలో మరింత వేగంగా వెళ్లే క్రమంలో పోలీసుల చెయ్యి వారిలో ఒకరికి తగలింది. కొంత దూరం ముందుకు వెళ్లిన యువకులు తిరిగి స్కూటీలో వెనక్కి వచ్చి రాయి తీసుకొని పోలీసులపై విసరడంతో ఎస్ఐ హైమావతికి తగిలి మొబైల్ ఫోన్ పగిలిపోయింది. తర్వాత యువకులు స్కూటీని వేగంగా నడుపుకుంటూ పారిపోయారు. మొబైల్ ఫోన్ పగిలిన అద్దాలు గుచ్చుకోవడంతో ఎస్ఐకి కొద్దిపాటి గాయమైనట్లు తెలుస్తోంది. రాయి విసిరిన వారు ఆకతాయిలా లేక ఇసుక అక్రమ రవాణాదారులా అనే దానిపై పోలీసులు విచారణ చేస్తున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇద్దరు యువకుల కోసం ఐదు పోలీసు బృందాలు గాలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కడపలో తల్లీతనయుల అదృశ్యం



కుమారులతో తల్లి షేక్ ఫర్హత్ అంజుమ్ (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తల్లీ, ఇద్దరు కుమారులు అదృశ్యమయ్యారు. వివరాలు ఇలా.. సాధుచెంగన్న వీధికి చెందిన షేక్ ఫర్హత్ అంజుమ్‌కు(35), బెల్లంమండి వీధిలో నివాసం ఉంటున్న షేక్ అల్తాఫ్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు షేక్ అబ్దుల్లా(13), షేక్ ఇబ్రహీం(11)లు ఉన్నారు. ఆ తర్వాత భార్యాభర్తలు మనస్పర్ధలతో విడిపోయారు. ఈ క్రమంలో ఆమె తన ఇద్దరు కుమారులతో కలిసి తల్లి షేక్ ముంతాజ్ బేగం వద్ద ఉంటోంది. ఈ నేపథ్యంలో ఈనెల 8వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల సమయంలో మాసాపేటలోని ఓ స్కూల్‌లో చదువుతున్న తన ఇద్దరు కుమారులను తీసుకుని వస్తానని తల్లికి చెప్పి ఫర్హత్ వెళ్లింది. తరువాత తన కుమార్తె, ఇద్దరు మనుమల ఆచూకీ తెలియరాలేదని ముంతాజ్ బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారి ఆచూకీ తెలిసిన వారు 9121100513, 9121100517, 9121100518 ఫోన్ నంబర్లలో లేదా పోలీస్ స్టేషన్‌లోగానీ, డయల్ 100కు గానీ సమాచారం ఇవ్వాలని కడప టు టౌన్ పోలీసు స్టేషన్ ఎస్ఐ సంజీవరాయుడు కోరారు.

కేసుల పరిష్కారం కోసమే జాతీయ లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి
- జిల్లా వ్యాప్తంగా 3168 కేసులకు పరిష్కారం.. రూ.4,22,73,429 నష్టపరిహారం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి

కడప అర్బన్ : జిల్లాలో రాజీ అయ్యేందుకు వీలున్న పెండింగ్ కేసుల పరిష్కారం కోసమే జాతీయ లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేశామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ చైర్మన్ జి. శ్రీదేవి అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం సందర్భంగా కడపలోని జిల్లా కోర్టులో న్యాయసేవాసదన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ వైఎస్ఆర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 23 బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. కడపలో 6, ప్రొద్దుటూరులో మూడు, రాజంపేటలో ఒకటి, రాయచోటిలో మూడు, బద్వేల్‌లో రెండు, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లి, మైదుకూరు, సిద్దవటం, నందలూరు, రైల్వేకోడూరులలో ఒక్కో బెంచీని ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేసిన న్యాయవాదులు, రెవెన్యూ, పోలీసు, వైద్యులు, ఇతర ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి న్యాయమూర్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి జి.గీత, నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి. దీనబాబు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత, సీనియర్ అడిషనల్ సివిల్ జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్, పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా 3168 కేసులకు పరిష్కారం

జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో దాదాపు 3168 కేసులను పరిష్కరించారు. వీరికి నష్ట పరిహారంగా రూ. 4,22,73,429 చెల్లించారు.

నగదు జమపై పోలీసులకు ఫిర్యాదు



ఎస్ఐకి తెలుపుతున్న ప్రదీప్

పోరుమామిళ్ల: ఐఆర్ఈపీ బ్యాంకు మేనేజర్‌గా పని చేస్తున్న స్థానిక గిరినగర్‌కు చెందిన బొజ్జ ప్రదీప్(బాబి) అనే యువకుడి బ్యాంకు ఖాతాలో శుక్రవారం రూ.20 వేలు జమ అయింది. తన ఖాతాలో ఎవరి ఖాతా నుంచో ఈ మొత్తం పడిందని శనివారం గమనించిన ప్రదీప్ సమాచారం ఎస్ఐ మల్లికార్జునరెడ్డికి తెలిపారు. ఈ డబ్బు ఎవరి నుంచి వచ్చిందో విచారించి వారికి చేర్చాలని ఆయన ఎస్ఐని కోరారు. ప్రదీప్ నిజాయితీని పలువురు అభినందించారు.